# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 16-5-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :30 | సంచిక:220 | పేజీలు:6 | వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

అడవి గజం
జనవిహార యాత్ర
నీటి ఎద్దడి
మత్తు చాక్లెట్లు
విద్యార్థుల బ్యాగుల్లో
విద్య చీకట్లో
క్రోధి వత్సరం
కోరికల పూతోట
ఆనందో అద్దీ
వడగాలులు
శీతల పానీయాలు
గ్రీష్మ వెతలు
నీరుంటే ఊరు
వలస పోనిజనం
జలమే శ్వాస



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ఓటమెవరొ గెలుపెవరిదొ
కొన్నాళ్ళుండాలి ఓర్పు !
ఇరువురిలో బలాబలాల్
చూడాలోయ్ ప్రజా తీర్పు!
పోటాపోటీ జరిగిన
సార్వత్రిక ఎలక్షన్ !
కాబోయే ప్రధానెవరొ
ఓటు చేయు సెలక్షన్ !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## బోల్ గార్డ్ 11 రకం పత్తి విత్తనాలు సిద్ధం చేయండి.. మంత్రి తుమ్మల



**-ఈ ఏడాది 60.53 లక్షల ఎకరాలలో పత్తి సాగు**
**-అందుకు అనుగుణంగా విత్తనాలు రెడీ**
**-పత్తి విత్తనం ప్యాకెట్ ధర రూ.864**
**-అంతకంటే ఎక్కువ అమ్మితే డీలర్లపై చర్యలు**
**-వ్యయసాయ శాఖాధికారుల సమీక్షలో**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి.**

హైదరాబాద్, మే 15 :ఖరీఫ్ 2024లో రాష్ట్రంలో దాదాపు 60.53 లక్షల ఎకరాల్లో ప్రత్తి సాగు కాగలదని వ్యవసాయశాఖ అంచనా వేయగా, దానికి సరిపడా పత్తి విత్తనాలను మే చివరి నాటికి రైతులకు అందుబాటులో ఉంచే ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 2021లో 60.53 లక్షలు ఉన్న ప్రత్తి విస్తీర్ణం క్రమంగా తగ్గుతూ 2023లో 45.17లక్షలకు వచ్చిందనీ, ఐనప్పటికీ ప్రపంచ మార్కెట్లో ప్రత్తికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం పెరిగే అవకాశముందన్నారు.. దీనికి తగ్గట్టుగానే బీజీ11 రకం విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించారు.

నేడు హైదరాబాద్ సచివాలయం లో జరిగిన వ్యవసాయ శాఖ అధికా రుల సమావేశంలో మంత్రి మాట్లాడు తూ గతేడాది 90 లక్షల ప్యాకెట్లు అమ్ముడుపోగా, ఈసారి 120 లక్షల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రెండు దఫాలు సంబంధిత అధికారులు, విత్తన కంపెనీలతో సమావేశం జరిపి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఈసారి బోల్ గార్డ్ 11 రకం ప్రత్తి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ.864.00 గా నిర్ణయించిదని, ఏ ఒక్క డీలరైనా, అంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా విత్తన సరఫరాలో ఇబ్బందులు సృష్టిస్తే ఏ కంపెనీని ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజ నాలకు భంగం కల్గించే ఏ చర్యను ఈ ప్రభుత్వం సహించబోదని, విధుల పట్ల అలసత్వం వహిoచినా అధికారు లపై కూ డా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేసుకొని, ఎప్ప టికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాల్సిం దిగా అధికారులను మంత్రి ఆదేశించారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన బాబు మృతి.. వనస్థలిపురంలో ఘటన

హైదరాబాద్, మే 15 : వనస్థలిపురం ఏరియా ప్రభుత్వ దవాఖానలో దారుణం చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన బాబు మృతి చెందాడు. బాధితులు తెలిపిన కథనం మేరకు.. హయత్ నగర్‌కి చెందిన శిరీష అనే మహిళకు తెల్లవారు జామున 3 గంటలకి డెలివరీ చేసే సమయంలో బొడ్డు పేగు మొదటగా కత్తిరించ డంతో బాబు మృతి చెందాడు.

బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కలిసినా ప్రయోజనం లేకపోయింది దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇలాంటి ఘటనలు పదే పదే జరుగుతున్నా హాస్పిటల్ వైద్యుల తీరు మారడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శబరిమల అయ్యప్ప సేవలో మంత్రి పొంగులేటి..



హైదరాబాద్, మే 15 :శబరిమల అయ్యప్ప స్వామిని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నేటి ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆయన మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండడం కోసం అయ్యప్ప దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు.

ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు రావాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వాలని వేడుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఇటీవల ఎన్నికల సందర్భంగా తీరికలేని సమయంతో కొంత అలసట, ఒత్తిడి ఏర్పడ్డాయన్నారు. శబరిమలై అయ్యప్ప స్వామి వారిని దర్శించుకోవడంతో ప్రశాంతత లభించిందని మంత్రి తెలిపారు.

అయ్యప్ప దర్శనం ఎంతో ఆనందం ఇచ్చిందన్నారు. మంత్రితో పాటు అయ్యప్పను దర్శించుకున్న వారిలో భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట శాసనసభ్యుడు జారే ఆదినారాయణ, డీసీసీ చైర్మన్, తుళ్లూరి బ్రహ్మయ్య, డీసీఎంఎస్ చైర్మన్, మువ్వా విజయ్ బాబు, ఎండి నవాబ్ ఉన్నారు.

## మీరు చెప్పే 'ప్రేమను పెంచడం' ఇదేనా రాహుల్ జీ.... : ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, మే 15 : అచ్చంపేటలో బుధవారం బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడిన ఘటనపై.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'మీరు చెప్పే 'ప్రేమను పెంచడం' అంటే ఇదేనా రాహుల్ జీ' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో కేటీఆర్ ఒక పోస్ట్ పెట్టారు.

ఆ పోస్టుకు కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ నేతలపై దాడి చేస్తున్న ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోస్టు చేసిన వీడియోను కేటీఆర్ జతచేశారు. కాంగ్రెస్ నేతలు అధికార దుర్వినియోగంతో ప్రత్యర్థులపై దాడులు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ దాడులు, దుర్భాషల్లో పోలీసులు కూడా భాగస్వాములు కావడం సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు.

దాడికి పాల్పడిన గూండాలపై, ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులపై చర్యలు తీసుకోకపోతే తాము మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామంటూ తెలంగాణ డీజీపీ ని టాగ్ చేశారు. తాము కచ్చితంగా న్యాయాన్ని గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

## కొనసాగుతున్న బాంబు బెదిరింపులు.. తాజాగా పది స్కూళ్లకు ఈమెయిల్స్

లక్నో, మే 15 : దేశంలోని పలు రాష్ట్రాలకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. స్కూళ్లు, ఆసుపత్రులు, ఎయిర్‌పోర్ట్స్ వంటి వాటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తాజాగా మరో పది స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సుమారు పది స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బాంబులతో పేల్చివేస్తామంటూ ఆ స్కూళ్లకు ఈమెయిల్స్ అందాయి.

కాగా, ఈ విషయం తెలియడంతో జిల్లా యంత్రాంగతం అప్రమత్తమైంది. పోలీసులు, బాంబు నిర్వీర్య బృందాలు ఆయా స్కూళ్లకు చేరుకుని తనిఖీలు చేపట్టాయి. విద్యార్థులు, స్కూల్స్ సిబ్బందిని ఇళ్లకు పంపివేశారు. రష్యాలోని సర్వర్ల ద్వారా ఈమెయిల్స్ వచ్చాయని పోలీస్ అధికారి తెలిపారు. స్కూళ్లకు బాంబు బెదిరింపులపై సైబర్ సెల్ విభాగం దర్యాప్తు చేస్తున్నదని చెప్పారు.

మరోవైపు మంగళవారం బెంగళూరులోని ఎనిమిది స్కూళ్లకు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చాయి. గత వారం కూడా నగరంలోని ప్రముఖ హాస్పిటల్ చైన్ అయిన సెయింట్ ఫిలోమినాకు బాంబు బెదిరింపు వచ్చింది. ఈ బెదిరింపు ఈమెయిల్ అన్నీ బూటకమని ఆ తర్వాత తేలింది.

## ఉత్తరాఖండ్ అడవుల్లో ఆగని మంటలు..

**-రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు మండిపాటు**

డెహ్రాడూన్, మే 15 : ఉత్తరాఖండ్ అడవుల్లో రాజుకున్న మంటలను నియంత్రించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభు త్వంపై సుప్రీం కోర్టు మండిపడింది. అటవీ శాఖ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే నిధులు కేటాయిం చని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడింది. గత ఏడాది నవం బర్ నుంచి ఉత్తరాఖండ్ అడవుల్లో మంటలు చెలరేగుతు న్నాయి. మంటలు విస్తరిస్తుండటంతో 1,437 హెక్టార్లకు పైగా పచ్చని చెట్లు కాలిపోయాయి. అటవీ ప్రాంతం దగ్ధంతో లక్షల్లో నష్టం వాటిల్లింది.కాగా, ఉత్తరాఖండ్ అడవుల్లో చెలరేగిన మంటలను నియంత్రించకపోవడంపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. 40 శాతంపైగా అడవులు అగ్నికి ఆహుతైనట్లు న్యాయవాది పరమేశ్వర్ కోర్టుకు తెలిపారు. మంటలను నియంత్రించలేక పోతున్నా రని ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు ఉత్తరాఖండ్ ప్రభుత్వం తరుపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అడవుల్లో కొత్తగా మంటలు లేవని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన నిధులు అందలేదని చెప్పారు. మంటల నియంత్రణకు 9,000 మందికిపైగా పని చేస్తున్నా రని అన్నారు. కేంద్రం, రాష్ట్రానికి చెందిన ఆరుగురు సభ్యుల కమిటీ పర్యవేక్షిస్తున్నదని, 420 కేసులు నమోదయ్యాయని వివరించారు.

కాగా, అడవుల్లో మంటల నియంత్రణకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం పది కోట్లు డిమాండ్ చేయగా కేంద్రం రూ.3.15 కోట్లు కేటాయించడంపై సుప్రీంకోర్టు కోర్టు మండిపడింది. అలాగే అటవీ శాఖ సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, బాధ్యతా రహిత్యంపై సర్వోన్నత న్యాయస్థానం నిప్పులు చెరిగింది.

## ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి దిగ్బంధం



హైదరాబాద్, మే 15 :ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మండిపడుతున్నారు. కండ్ల ముందే పంటలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు ఆందోళన బాటపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తూ, రోడ్లపై బైఠాయిస్తూ తమ నిరసనను తెలుపుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్నదాతలు ఆందోళనబాటపట్టారు.

నెల గడుస్తున్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు, బుధవారం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.స్థానిక తహసీల్దార్ శ్రీధర్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కాగా, అంతకుముందు భువనగిరి మండలం పచ్చళ్లపాడు తండా గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వడ్లు కొనకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు షాకే.. జూన్ నాలుగున దిమ్మతిరుగుడు ఖాయం

కరీంనగర్, మే 15 : ముస్లింలంతా ఏకమై బండి సంజయ్ ని ఓడించాలని కేసీఆర్ పిలుపునిస్తే హిందువులంతా ఏకమై బండి సంజయ్ ని గెలిపించబోతున్నారని అన్నారు బిజెపి అభ్యర్థి బండి. హిందువులు ఏకమైతే ఎలాంటి ఫలితాలు వస్తాయో జూన్ 4వ తేదీన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చూపించబోతున్నారన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు..జూన్ 4న రాబోయే ఫలితాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెంపపెట్టు తప్పదని అన్నారు.

కేసీఆర్ లాంటి వ్యక్తుల కుటిల పన్నాగాలకు హిందు వులంతా ఐక్యత చూపించారన్నా రన్నారు. ఆ షాక్ ను చూసి కేసీఆర్ తట్టుకునేందుకు పక్కన సిద్ధంగా డాక్టర్లను పెట్టుకోవాలన్నారు. కేసీఆర్ వందేళ్లు బతకాలని కోరుకునే వ్యక్తులం తామని.. ఇకనైనా ఓ వర్గానికి కొమ్ము కాస్తూ హిందువులను రాచిరంపాన పెట్టవద్దన్నారు.

తన గెలుపు కోసం అన్ని వర్గాల ప్రజలు పని చేశారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కార్ ఏర్పడాలనే సంకల్పంతో అలుపెరుగని కృషి చేసిన బీజేపీ కార్యకర్తలు, స్థానిక నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## 10 రోజులపాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లు బంద్

హైదరాబాద్, మే 15 : తెలంగాణలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమాన్యాలు థియేటర్లను బంద్ చేస్తున్నట్లు ప్రకటించాయి. ఆక్యుపెన్సీ తక్కువ ఉండ టంతో శుక్రవారం నుంచి పది రోజుల పాటు షోలు వేయవద్దని నిర్ణయం తీసుకున్నారు.ఎన్నికలు, ఇతర కారణాలతో ఇటీవల పెద్ద సినిమాలు విడుదల కాలేదు. దీంతో సినిమా హాళ్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. సినిమాలు విడుదల లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం..

**నవ షట్పదులు**

తొలి నాళ్లలో వినోద, విజ్ఞానాన్ని
అందరికీ అందించినవి రేడియోలే!
మలినాళ్లలో విశేషంగా
ఆనందాన్ని కలిగించినవి "ఆడియో"లే!
ప్రస్తుత కాలంలో విపరీతంగా
ప్రభావితం చేస్తున్నవి "వీడియో"లే!

నేటి పత్రికల్లో ఏ పేజీ చూసినా
నేతల పచ్చి బూతులే!
వేదిక లెక్కాక సంక్షేమాల
సోది, సొరకాయ కోతలే!
అమలు కాని పథకాలతో
అల్లాడే పేదలకు వాతలే!



- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## లారీ.. బైక్ ఢీ.. ఇద్దరు యువకులు మృతి..

అమరావతి, మే 15 :ఫిరంగిపురంలోని రేపూడి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెం గ్రామానికి చెందిన గోసాల లూర్దు రాజు, నల్లపాడు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

**చురక**

ఐదేళ్ల ప్రభుత్వానికి
అధికారిక ప్రజాతీర్పు
గౌరవించకుంటే ఎలా
గొప్ప రాజకీయ మార్పు
సంక్షోభం అంటూ ఎలా
శాపనార్థ దుర్బుద్ధులు
ప్రజాస్వామ్య కూల్చివేత
ప్రయత్నాల నిబద్ధులు



-వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం- నేటికీ అందం**

ఇక్కట్లను దొలగించగ-
ఉక్కడ గించంగ రేగు ఉన్మాదములన్
సిక్కిము నొక రాష్ట్రమ్ముగ
నక్కున తాజేర్చె భారతావని ప్రేమన్

(16-5-1975 సిక్కిమ్ భారత్ లో చేరిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210







# నేటి నిజం సాహితీ కెరటాలు

website:www.netinijam.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 16-5-2024


## రక్ష



మంచు కొండల్లో
ఎర్రని ఎండల్లో
రాత్రనక, పగలనక
సరిహద్దుల్లో సేవ చేసే
జవానుల్లారా–
ఆగకుండా మంచు కురిసినా
కొండచరియలు విరిగిపడినా..
శత్రుసేనలు విరుచుకుపడినా
ప్రకృతి కన్నెర్ర చేసినా
అమ్మలుదిద్దిన వీర తిలకాలే మీకు రక్ష!
చెల్లెళ్ళు కట్టిన రాఖీలే శ్రీరామ రక్ష!



–ఎన్.విజయా కిషన్ రెడ్డి
98488 68085

## ఘంటారావం


సందర్భానుసార సంభాషణం
సంస్కార లక్షణం
అప్రస్తుత అభిభాషణం
అవివేక లక్షణం.

భజనకు
అలవాటు పడితే ఎలా?
సృజన
సన్నగిల్లుతుంది కదా

ఒక్క నవ్వులో
ఎన్ని పువ్వులో
ఒక్క నవ్వులో
ఎన్ని నవ్వులో

బాగున్నప్పుడు
గణితం
బాగా లేనప్పుడు
భాగవతం.

మూడు ముళ్ళ
బంధం
నూరేళ్ళ
గంధం



–గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## A POET IN CANADA
# SPACE FOR THE DREAMS

నాటక పోటీల రాత్రి తర్వాత
వెలుగుల, వేడుకల సందడి తర్వాత
మరునాడు మిగిలిన ఉదయపు స్టేజీలా
నిన్నటి ఫుట్ బాల్ గ్రౌండ్
నిద్రలో నవ్వుతున్న ముఖంలా వుంది.

పిల్లలు లేని గ్రౌండ్
ఫుట్ బాల్ యెగరని గరిక వొంపులు
హైస్కూల్ కు హాలిడే నేమో,
చుట్టూ వున్న రోడ్ల మీద సవ్వడి
సరిగమలు మరిచి పోయింది .

మొన్న మొన్నటి దాకా,
రిబ్బన్ లేని జడల్లాంటి
ఎండిన చెట్ల నిటారు పుల్లలు
విరబోసు కున్న పువ్వుల కురుల్లా
పచ్చగా మరేదో రంగు మారుతున్న
యిగురులా గుబురేస్తున్నాయి.

ఫుట్ పాత్ ల పక్కనున్న
గరిక మీద వాలికిన
పసుపు పచ్చని రత్నాల పూలను
ఏదో బండితో తీసేస్తున్నారు

ఆకాశం నన్నే చూస్తోందన్న
అనుమానం వేస్తుంది
పక్షులు పక్షులుగా నా చూపులు
మేఘాలు దాటుతున్నాయి.

ఎండ ఈ రోజు మెత్తగా వుంది
గాలి కొంచెం ఆరి నట్టుంది
మనం నడుస్తున్నప్పుడు,
ముడతలు లేని వస్త్రమేదో
జుట్టు చెరిగేలా లాగు తున్నట్టుంది.

మనం గమనించం కానీ,
ప్రతి ప్రదేశానికి, తెలియని,
వొక పరిమళ ముంటుంది
పక్కనుండి
ప్రాంతీయ మనుషులు వెళ్ళి నపుడు
కొంత తెలుస్తుంది.

వాళ్ళు మాట్లాడి నపుడు యాసలో,
వింత సొగసు వాసన తెలుస్తుంది.
ఇక్కడి దుమ్మూ దూళీ
యే రంగులో
వుంటుందో చూద్దామని వుంది.

ఎన్ని కార్లు నడిచినా
ఎక్కడి వీధుల్లో ఆగినా
చల్లదనం కూడా
స్నాన మాడి వచ్చి నట్టు
శుభ్రంగా చుట్టుకొని జారి పోతుంది.

ఈ రోజును కెనడా అనాల్నా,
ఒంటారియో టొరంటో,
Kitchener అనాల్నా !
రంగస్థలం మీది తెర లాగి నట్టు
రోజూ నా కొక కొత్త నాటకం చూపించే
నాకు ఇష్టమైన
బాల్కనీ మాయా అనాల్నా !
నాకు మాత్రమే అర్థమయ్యే
సంజయ్ లీలా భన్సాలీ
"హీరామండి" లో వినిపించే
కవిత్వం అనాల్నా !.

నాకు ఈ బాల్కనీ దగ్గర కూర్చొని
ఏదైనా తాగాలని వుంది.

చాయ్ కాదు
వైన్ కాదు
బీర్ కాదు
బ్రాందీ, విస్కీ, జిన్, రమ్ కాదు
మరేదో తాగాలని వుంది
విషం కాదు
అమృతం కాదు
ఏదో తాగాలని మాత్రం వుంది.

స్వప్నంలో నైనా సరే,
దాన్ని తప్ప కుండా తాగి తీరు తాను




– ఆశారాజు
9392302245

## గోడ

పుట్టుకతో
ఏ భగవంతుడూ నిర్మించలేదు
నీకూ అతనికీ మధ్య గోడ
అది కేవలం.

మానవ నిర్మితం–
ఒకరి స్వార్థం
ఇంకొకరి ద్వేషం
మరొకరి క్రూరత్వం.

అన్నీ కలిసి కట్టిందే ఆ గోడ.
ఆ గోడ.
నీ పురోగతికి
నీ జాతి మనుగడకు
అడ్డుగోడ.
ఈనాటికైనా దాన్ని ఛేదించి
సమ సమాజాన్ని స్థాపించు.




– భూషి కృష్ణదాసు
సెల్:9618069338


# శ్రీనివాస్‌గౌడ్ పలుకుతున్న "ధైర్య వచనం"

సమాజంలోని అస్తవ్యస్త పరిస్థితులను, ఆకృత్యాలను, శ్రమశక్తి దోపిడినీ ఎత్తి చూపడమే కాదు... వాటికి పరిష్కార మార్గాలను సూచిస్తు పీడితులకు "ధైర్య వచనం" పలుకుతూ కవిగా తన బాధ్యతను నెరవేరుస్తు న్నారు అభ్యుదయ కవి పి. శ్రీనివాస్ గౌడ్. బాధితుల వేదనను వర్ణిస్తూనే వాళ్ళకు ఆపన్న హస్తం అందించి ధైర్య వచనం పలికే మానవతా మూర్తులకు అక్షర నీరాజనం పలుకుతున్నారు.

2012–2020 సం॥ల మధ్య కాలంలో తాను రాసిన 57 కవితలతో 'ధైర్య వచనం' శీర్షికన ఓ కవితా సంపుటి వెలువరించారు శ్రీనివాస్ గౌడ్. యిది ఆయన సృజించిన ఆరవ గ్రంథం. కేవలం కవిత్వమే కాదు.. కథలు, వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, అనువాద రచనల్లో సిద్ధహస్తుడు గౌడ్.







ప్రతులకు:
పి. శ్రీనివాస్ గౌడ్,
డో.15–22–2/1
ముంతవారి వీధి,
ఎస్.జి. కాంప్లెక్స్
చీరాల–523 155.
సెల్: 99494 29449

**"ఇంకా అంతా అయిపోలేదు**
**ఇంకా లోపల ఒక చిగురు**
**శ్వాసిస్తునే వుంది చిన్నగా..**
**ఇంకా అంతా చీకటి ఆవరించలేదు**
**ఇంకా ఎక్కడో చిరు దివ్వొకటి**
**మిణుకుమంటూనే వుంది సన్నగా..**
**స్వీయ నిర్బంధ నియమాల మధ్య**
**తనని తాను ఒలుచుకొని, మలుచుకొని**
**మనిషి మళ్ళీ నిర్మితమవ తున్నాడు**
**ఇంకా ఏదీ అయిపోలేదు**
**ఇంకా ఏదీ అయిపోలేదు**
**ఈ కల్లోల కాళరాత్రి కరిగి**
**రేపు 'ఉదయమవుతుంది"**

కాలం చాలా గొప్పది. ఎప్పుడూ ఒకేలా వుండదు. ఎల్లప్పుడూ చీకట్లనే కురిపించదు. చీకట్లను చీల్చుకుని ఉదయమవ్వడం నిజం. వెలుగులు పూయించడం ఖాయం.

**"కాలం నిష్పక్షపాతి**
**సంతోషానికి దుఃఖానికీ**
**ఒకటే మాట చెపుతుంది**
**'ఈ సమయం వెళ్ళిపోతుంది."**

యిలా అనేక కవితల్లో ధైర్య వచనం లేపనంలా పూస్తాడు.

**"ధైర్య వచనం..**
**అదొక రూపంలో వుండదు**
**ఒక చోట వుండదు**
**అదొక రూపం వెతుక్కుంటుంది**
**ఒక మనిషి రూపం తొడుక్కుంటుంది**
**విడిచి వెళ్ళిన అడుగు జాడల్లో**
**ఒక మనిషి నడిచివస్తాడు**
**మూసి వున్న తలుపులు తెరుచుకొని**
**ఒక మనిషి తేలివస్తాడు**
**ధైర్యం అతని రూపు తీసుకుంటుంది**
**సాయం అతని శైలి తీసుకుంటుంది**
**చూడటానికి అతను**
**మనలాటి మనిషే గానీ..**
**మనలా గడ్డ కట్టుకుపోయిన మనిషి కాదు**
**లోపల జల ఎండిపోయిన మనిషి కాదు**
**కకావికలంగా చెదిరిపోయిన వాళ్ళలో**
**ఒక ధైర్యం లేపనంలా పూస్తాడు"** ఆపదలో అపన్నులను ఆదుకునే తనమిత్రుడు రమణారెడ్డిని శ్లాఘిస్తు శ్రీనివాస్ రాసిన కొన్ని కవితా పంక్తులు యివి.

గోదావరి పడవ ప్రమాదం లో మునిగిన అనేక మందిని కాపాడిన మానవతామూర్తులు, వలస కార్మికులకు అండగా నిలబడి చేయూతనందిస్తు సాయం చేస్తున్న నిజమైన మనుషులు ఇలా ధైర్య వచనాన్ని కవచంలా అందిస్తున్న నిస్వార్థ సేవా తత్పరులు శ్రీనివాస్ కవితా వస్తువులు.

నాన్న ఏం చేస్తాడు?
**"కళ్ళల్లో కన్నీటి బొట్టుమీద**
**ధైర్యం రూపాకృతి దాల్చి**
**చిరునవ్వుతో భరోసా ఇస్తూంటాడు"..**

భరోసా ఇవ్వడమంటే ధైర్య వచనం పలకడమే.. నాన్న అంటేనే "నేనున్నాను.. నీకేం భయం లేదు" అంటు ధైర్యం నూరిపోసే మార్గదర్శకుడు.

అస్తిత్వాన్ని కోల్పోతున్న పల్లెల గురించి కవి ఆవేదన.
**"పట్నం పొలిమేరలు బలిసి**
**నగరం మహా నగరమని మీసం తిప్పుతుంటే**
**పల్లెలు బక్కచిక్కి బోసిపోతున్నాయి"**

యిదీ కళ్ళకు కనబడుతున్న దృశ్యం.
**"ఖాళీ అవుతున్న పల్లెలు**
**తమ కడుపుల్లోంచి**
**ఇంత కబళం నోటికి అందియ్యకపోతే**
**కరెన్సీ నోట్లు తిని**
**నగరం కళ్ళు తేలేయాల్సిందే–**
**కాలే కడుపుతో**
**పల్లె కాళ్ళకు ప్రణమిల్లాల్సిందే–"**

ఇదీ యదార్థం.

"గేటు దగ్గర" ఓ మంచి కవిత. అదో రైల్వే గేటు. రెండు వైపులా చిరు వ్యాపారులు. వాహనదారులు. ఒకరు గేటు పడాలని.. మరొకరు గేటు పడకూడదని ఎవరి తొక్కిడి వారిది.
**"ఒక్కోసారి గేటు పడుతుండాలి**
**జీవితం కళ్ళబడుతుంది.**
**ఒక్కోసారి గేటు తీసుండాలి**
**జీవితం తుళ్ళిపడుతుంది**
**గేటు ఒక ప్రతీక**
**హెచ్చరిక..**
**ఆగి.. మెలగి..సాగడానికి.."**

దృశ్యం అదే.. సామాన్యుడు చూస్తుండిపోతాడు. సృజనకారుడు పద్యమై ప్రవహిస్తాడు.


ఏముంటుందా చేతుల్లో? ఎవరి చేతుల్లో? యింకెవరు.. మహాకవి శివారెడ్డిగారే..
**"క్రుర కలాల భుజాలమీద చేతులేసి**
**కాఫీతో కవితలూ చప్పరించి**
**కౌగిలించుకునే చేతుల హృదయ ముంటుంది.**
**ఏముంటుందా చేతుల్లో..**
**మేలుగొలిపే కలవుంటుంది**
**మరో ప్రపంచపు ఆశ వుంటుంది**
**దేశం వుంటుంది**
**దేశం కలలు కనే కలవరింత వుంటుంది**
**ఎక్కడా తల వంచని.. ఎక్కడా తలదించని**
**చరిత్ర తాళం చెవివుంటుంది"**

శివారెడ్డితో కొద్దిపాటి సాన్నిహిత్యం వున్నవాళ్ళుకూడా శ్రీనివాస్ గౌడ్‌తో ఏకీభవించక మానరు. ఒక మహావృక్షం నీడన సేద తీరుతున్న అనుభవం కలుగుతుంది.

**"దళిత వీరబాహుడు.. వెలివాడల గండ్రగొడ్డలి"** అని మద్దూరి నగేష్ బాబుని కీర్తిస్తు, దేవీప్రియతో పరిచయం"అమ్మ చెట్టు నీడ కింద" కలిగే హాయిని యిచ్చేదని గుర్తు చేసుకుంటు శ్రీనివాస్ అల్లిన కవితలు కడు హృద్యంగా పాఠకుల్ని అలరిస్తాయి.

**"కాసేపు ఆట**
**కాసేపు బిక్షాటన**
**వీధి బాలురు.."** వంటి నాణ్యమైన హైకులు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి.

కవిత్వాన్ని కవిత్వంలా సృజించే ఆధునిక కవుల్లో శ్రీనివాస్‌గౌడ్ ముందు వరుసలో నిలుస్తారు. **'ధైర్య వచనం'** సంపుటిలోని కవితలన్నీ చదివింతర్వాత వైవిధ్యభరిత కవిత్వం ఆస్వాదించిన తృప్తి కలుగుతుంది.



–రమణ వెలమకన్ని
సెల్:98660 15040

# ఆస్ట్రేలియా .. ఆస్ట్రేలియా...

మానవ సంచారం లేని
నగరారణ్యం లాంటి ఆస్ట్రేలియా
జీవన సమరంలో
ఒక మేలు రాయి లేక మైలురాయి
ఇక్కడ ఏ మనిషి ముఖపు అద్దంలో
నేను కనిపించడం లేదు
ఏ చిరునవ్వు ఉదయం లోను
మనసు తామర పువ్వు వికసించడం లేదు
దూర దూరంగా
అస్పృశ్య మహా నాగరిక స్నేహ డోలికల్లో
అసలు నేను ఊగడమే లేదు
ఇక్కడి భారతీయులంతా
జీవన పోరాటమహా సరస్సులో
బుర్రకాయలు కట్టుకుని ఈత కొడుతున్న వాళ్లే
ప్రతి మూల మలుపులోను
కొత్త దారిని వెతుక్కుంటున్న వాళ్లే
కరెంటు లేని ఈ కరచాలనాలు
పెదాల పైన ఎంత వెన్నెల వేలాడదీస్తున్నాయో?
ఎన్ని హృదయం బహిష్కరించిన ప్లాస్టిక్
పూలను మన పైకి విసురుతున్నాయో
నిజమే.........
ఇక్కడ పెద్ద పెద్ద మాల్స్ లో ఎంతో క్రమశిక్షణ
వయసును ప్రశ్నించని
అతి సంస్కారం
అయితే ఏం ?
అజ్ఞాత శాసనాలు గీచిన గిరిలో
కదలే రోబోట్లు వీళ్ళు
ఈ అశోకవనంలో
తెలుగువాడు కలిస్తే చాలు
పలకరిస్తే చాలు
సురలు కురిపించే అమృతం
చేతికందునట్లు అవుతుంది
స్పందనలు ప్రధానమవుతున్న
జీవన విలువల
విత్తనాలు హఠాత్తుగా
మొలిచినట్టు అవుతుంది.



డా॥కాంచనపల్లి
గోవర్ధన్ రాజు.
9676096614.

# అమ్మ ప్రేమకు కొలమానం లేదు



సత్యవాణికి పురస్కారం బహూకరిస్తున్న రమణాచారి

హైదరాబాద్, మే 15 :అమ్మ ప్రేమకు కొలమానం లేదని మాజీ ఐఏఎస్ అధికారి డా॥ కేవి రమణాచారి అన్నారు. అభినందన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా సాంఘిక సేవాకర్త సత్యవాణికి సంస్థ స్థాపకులు, భవాని మాతృమూర్తి మాదిరాజు వరలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ప్రఖ్యాత గాయకుడు డీవీ మోహనకృష్ణ అమ్మ కుసుమకు, ప్రముఖ గాయని విజయలక్ష్మి అమ్మ సుగుణకు మాతృవందనం పేరిట సత్కారం చేశారు. డా॥రమణాచారి మాట్లాడుతూ సత్యవాని భారతీయ వాణిగా మన దేశ సంస్కృతిని ప్రచారం చేస్తున్నారన్నారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కేవీ కృష్ణకుమారి, విజయానందకృష్ణ ఇందిరావిజయ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

పుస్తక సమీక్షలు

# పాఠకుణ్ణి వెంటాడే 'పోడుగాలి' కథలు

ఇవి కథలు కావు. గాథలు! పరిపూర్ణమైన గొప్ప గాయాల తాలూకు చెమ్మగిల్లిన గాథలు. ఒక పాత తరం వ్యక్తి కొత్తతరానికి చెప్తున్న కబుర్లు. ఓ హెన్రీ కథల్లా కొన్ని కొసమెరుపుతో చాలా కథలు ముగుస్తాయి. పాఠకుణ్ని ఆలోచనల్లో పడేస్తాయి.

ఈతకోట సుబ్బారావు **"పోడుగాలి"** చదువుతూ ఆపుస్తకం అట్ట చివర్లో నేను రాసుకున్న స్పాంటేనియస్ అభిప్రాయాన్ని ఇప్పుడు ఎత్తి రాస్తున్న ఈ రాతలో ఆ అనుభవం తాలుకు స్పర్శ వెనకాల ఆ కథల అనుభూతి నాలో ఎంతగా పేరుకుపోయిందో చెప్ప లేను. ఇవి కథలు కావు. గాథలు! పరిపూర్ణమైన గొప్ప గాయాల తాలూకు చెమ్మగిల్లిన గాథలు. ఒక పాత తరం వ్యక్తి కొత్తతరానికి చెప్తున్న కబుర్లు. ఓ హెన్రీ కథల్లా కొన్ని కొసమెరుపుతో చాలా కథలు ముగుస్తాయి. పాఠకుడ్ని ఆలోచనల్లో పడేస్తాయి. కొన్ని గొప్ప కథలు పోడుగాలిలో చదివి విస్మయం చెందుతాం! కథ నెమరు వేసుకొని కాసేపు ఆగిపోతాం. బరువెక్కిన గుండెతో ఆ కథల పుస్తకాన్ని ఒళ్ళో పెట్టుకొని శూన్యంలోకి చూస్తాం! మరో కథని కొంత ఊపిరి పీల్చుకొని పక్కనే అలలా దూసుకొచ్చే కథని చదివి మళ్ళీ ఆలోచనల్లో పడిపోతాం!

నవల చదవటం వేరు . అదోకిక్కు. చదువుతాపోతాము. రాత్రో, మరోరాత్రో ఏకబిగినో, గుండె బిగువునో.. కానీ కథలు చదవడం అంత తేలిక కాదు . కథ నెమ్మదిగా జీర్ణం అవుతుంది. అందుకే కథల పుస్తకాన్ని పట్టు కున్నాక ఒక కథ నుంచి మరో కథకి ప్రయాణం చేయటం అంటే మాటలు కాదు. అందునా పోడుగాలి కథలు మామూలువి కాదు. టిఫిన్ వేళ, భోజనం వేళ, రాత్రివేళ చపాతి తిన్నట్టు ఆరం ఆరంగా చదువుకోవాలి. నేను ఈ కథలు చదవటానికి ఆరు రోజులు పట్టింది. ఇంత మంచి కథకుడ్ని మనం ఎందుకు గమనించలేక పోయామో తల్చు కుంటే చాలా బాధ వేస్తుంది.


రెండుకులాల ప్రాపకంలో కథలు బంధీగా బతుకుతున్నాయి. వారు మెచ్చి ప్రమోట్ చేసిన కథకులే రాణి స్తున్నారు. తతిమ్మావారు రాసిన కథలు గుర్తింపుకి నోచుకోక పోవటం తెలుగు సాహిత్యంలో కనిపించని విషాద తరంగం. దాంతోపాటు ప్రాంతీయతత్వం మితి మీరటం మూలంగా కూడా మంచి కథలు తెరవెనకకి పోతున్నాయి. ఎంత గొప్ప కథకైనా ప్రచారం ముఖ్యం ఈతకోట సుబ్బారావుకి ఆయన చేతిలోని పత్రికే ఆయన కథలకి ప్రచారం కల్పించుకోలేని మొహమాట సంపాదకత్వం మూలంగా కొన్ని గొప్పకథలు ప్రచారానికి నోచుకోలేక పోవటం చూసి బాధ వేస్తుంది.

రచయిత కవి కావటం మూలంగా కూడా కథ చెప్పటంలో ఒక చోట కవిత్వం సహజంగానే వెల్లుబుకుతుంది. ఫోటో అనే కథలో ఈ వ్యక్తీ కరణ మనల్ని కట్టి పడేస్తుంది 81వ పేజీ.. **"అలా ఒక్క సంఘటన అడుసు ముద్దలాంటి రాములు గుండెని మొదట ఎండిన మట్టి కుప్పగా, ఆ తర్వాత బండ బారిన రాతి ముక్కగా తయారు చేసింది. ఆ క్రమంలోనే రాములు ఊరితో తనకున్న సంబంధాల్ని ముగించుకున్నాడు. కూలి పనికి వెళ్ళటం, తిరిగి చక్కా పాకకి చేరుకోవటం మినహా, ఎవరితోనూ మాట కలపటం కాని, కష్ట సుఖాలు విచారించటం కానీ చేయలేదు."** ఇటువంటి వ్యక్తీకరణ సాధారణ కథకుల్లో కనిపించదు. అసాధారణ కథకుల్లోనే ఆ శైలి కనిపిస్తుంది


అదే కథలో (ఫోటో) ఈ చెప్పే తీరు ఎంతో సహజంగా ఉందో చూడండి. 83వ పేజి.. **"కడుపు తీపి మాటల్లో ఉండదు. ఏడ్చే కళ్ళల్లో ఉండదు, గుండెలో గుండెగా కదిలిస్తోంది. "ఇటువంటి చిన్న వాక్య విన్యాసాలే పాఠకుడ్ని లాక్కోపోయి ఎక్కడికో విసిరేస్తాయి. అదే కథలో మరో వాక్యం ఉటంకిస్తా?."** అయినా ఒక తండ్రి హృదయం పడుతున్న ఆరాటం అతడి మనసును మంచుముక్క చేసింది."

పేరు ఈ కథకి రచయిత ఫోటో అని ఎందుకి పెట్టాడో పై వాక్యాలు గమనిస్తే మనం తేట పడ్తాము. ఒక బొమ్మకట్టి కథని చెప్పటంలో ఈతకోట సుబ్బారావు మనస్సుని ఎట్టా ఆవిష్కరిస్తున్నాడో చూస్తే మనం అబ్బుర పడ్తాము. అందరు రచయితలు కథని ఇలా ఒక ఫ్రేమ్‌లో షాట్ తీసి పాఠకుడి ముందు పెట్టలేరు.

ఈ పుస్తకంలో పదకొండో కథ పేరు చూడండి కొర్రమీనులకయ్య ఓహెన్రీలాగా







ప్రతులకు:
–ఈతకోట సుబ్బారావు
24/1697 రవీంద్ర నగర్,
2 వ వీధి నెల్లూరు 524004.
ఫోన్.9440529785

ఈతకోట సుబ్బారావు కథని నడిపిన తీరు అసాధారణమైనది. సాక్షి ఫన్డేలో నేను చదివాక ఆ కథ నా మనస్సులో శాశ్వితంగా ముద్ర వేసుకుంది. మళ్ళీ ఈ పోడుగాలి ఈతకోట సుబ్బారావు కథల్ని సమీక్ష కోసం తడుముతున్నప్పుడు ఓ పెను గాలిలా ఈ కథ గుర్తు కొచ్చింది.

అదే గొప్ప కథలక్షణం. కొర్రమీనుల కయ్య పాఠకుడిలో తిష్టవేసే కథనం మూలంగా చాలా చాలా గొప్ప కథగా మనం అంగీకరించక తప్పదు, పాఠకుడి జ్ఞాపకాల్లో నలిగిపోయే గాథలన్నీ ఓ చారిత్రాత్మక గొప్ప కథలే. ఇది అంత గొప్ప కథ. జీవితాంతం మనల్ని వెంటాడ్తుంది. ఇందులో నాయకుడు నక్కీరయ్య, అల్లం శేషగిరిరావు కథల్లోని ఏ పాత్రకీ తగ్గదు. దీటుగా నిలబడ్తుంది.

అయితే ఈ కథలోని గుర్తు పెట్టుకు లేని కవిత్వం చూడండి.

కథ గుర్తుకి అందుతుంది కవిత్వం గుర్తుకిరాదు. తిరిగి ఆకథని చదివించేతీరు మాత్రమే ఆ కథ ఎందుకు గొప్పదో తన మన మనసుని తట్టి చెప్తుంది. 95వ పేజి.. **" కాలం చాలా చిత్రమైంది. ఒకసారి పూల జల్లు కురిపిస్తుంది. మరోసారి ముళ్ళకంప నెత్తిన కుమ్మరిస్తుంది కాలాన్ని అర్థం చేసుకొనే ప్రక్రియలో ఎందరో మహర్షులు, మహాత్ములు, మునులు , తపస్వులు కాలగర్భంలో కలిసి పోయారు. కాలం లీలలు కాలానికే ఎరుక'.** ఒక శాశ్వితంగా గుర్తుండే కథలో కనిపించే తాత్వికత కూడా ఆకథని అజరామరం చేస్తుంది కొర్రమీనుల కయ్య కథ ఈశతాబ్దంలో వచ్చిన గొప్ప కథగా రికార్డు చేయని విమర్శకుడు నాదృష్టిలో ఉత్త సోమరిపోతు.


ఈ కథలో వర్తమానాన్ని చిత్రీకరించిన తీరు ఈ కథని డాక్యుమెంట్రీగా నిలిపి మనల్ని విలపింప చేస్తుంది. "కొర్ర మినుల కయ్య" ఈ ప్రపంచం మొత్తంగా చదువుకోకపోతే ఏదో పోగొట్టుకుంటుంది. ప్రపంచం భాషల్లోకి ఈ కథ అనువాదం కావాలి. అది నా తీర్మానం. దానికి పాఠకులు ఓ ఓటు వేస్తే కథకుడు ఈతకోట సుబ్బారావు కాల జ్ఞాపకాల్లో నిలబడిపోతాడు. ఈతకోట సుబ్బారావు కథల్లో కనిపించే సులభశైలీ ఓ కొట్టొచ్చే అంశంగా పేర్కొని తీరాలి. జర్నలిస్ట్ కావడం మూలంగా కూడా ప్రతి కథని చిన్న చిన్న సులభమైన వాక్యాలతో కథని అల్లుకోపోతాడు. కథ చివరి ముగింపున రెండు వాక్యాలలో ఆ కథ యొక్క సారాంశం మొత్తం రచయిత వివరిస్తాడు. తద్వారా ఆ కథ యొక్క మొత్తం సన్నివేశం పాఠకుడికి అందుతుంది.

ఈ ముగింపు కథన శైలి మరే ఇతర రచయితలోనూ కనపడదు. ఒక్క సలీం కథలో తప్ప, ఇటువంటి పతాక వాక్యాల రీతి వారిని గొప్ప కథకుల్ని చేసింది.

'ఆడపిల్ల' కథలో రాక రాక కడుపువస్తే అది తీయించేయమని పోరు జరుగుతుంది, గొడ్డుకి మనిషికి తేడా లేదా అని ప్రశ్న వేస్తుంది గోమతి. ఆఖరి ముగింపు వాక్యాలు ఉటంకిస్తాను. రామదేవమ్మ శంకరప్ప మంచు శిల్పాలై పోయారు. ఇద్దరి మనస్సులో ఒకే ప్రశ్న **"పుట్టాల్సిన ఆడ పిల్లల్ని చంపేస్తున్నాం. అంతకు ముందే పుట్టిన ఆడ పిల్లల్ని ఏం చేయాలి అని.... "!** ఇలాగే దాదాపు అన్ని కథలు సీన్ రివైండ్ చేసేలా పాఠకుడి జ్ఞాపక శక్తికి ఓమంచి సౌలభ్యాన్ని ఇస్తారు. కథ అంటే గుర్తుండి పోవటమే కాదు... గుర్తుండేలా రాయాలి. ఆశైలి ఈతకోట సుబ్బారావు పాటిస్తాడు.

అలాగే కథకుడు ఆకథని ఎందుకు రాశాడో కూడా రచయిత వివరిస్తాడు – ఈ టెక్నిక్ ని పాటించటం ద్వారా గొప్ప కథకి ఉండాల్సిన లక్షణాలేమిటో మన సుబ్బారావు తేట తెల్లం చేస్తున్నాడు.

**"పరిష్కారం, పసిహృదయం, పుట్టిన ఊరు, చేతికర్ర, ప్రాణం చెట్టు, అపరిచితులు"** మున్నగు కథలు పాఠకుడిని చలింపచేస్తాయి ! ముఖ్యంగా రచయితకి వివిధ ప్రాంతాలు. అక్కడి నైసర్గిక స్వరూపం, అక్కడి మనుష్య స్వభావాలు బాగా తెలుసు.అందుకే వైవిధ్య భరితమైన పాత్రలతో కథల్ని కథకుడు మలచగలిగాడు. 'పోడు గాలి' కథలు పాఠకుడ్ని నిజంగా ఎంతో చలింప చేస్తాయి, కదిలిస్తాయి, మంచి కథలతో మన ముందుకు ఈతకోట సుబ్బారావు వచ్చాడు. జేజేలు చెప్పుదాం!



–సాగర్ శ్రీ రామకవచం
9885473934

## సునందామృతం

### తటాక పరివాహ న్యాయము

తటాకము అంటే చెరువు.పరీవాహము అంటే తూము.

చెరువు నీరు తూము నుంచి కొంచెంగా పోయేలా విడువక పోతే గట్టు తెగి నీరంతా బయటకు పోతుంది. వట్టిపోయిన చెరువు అవుతుంది.

నీరు వదిలేటప్పుడు ఎంతో జాగ్రత్త వహించాలి.అలాగే అప్పుడప్పుడు చెరువులకు గండ్లు పడుతుంటాయి. చిన్న గండి పడ్డప్పుడే దానిని పూడ్చే ప్రయత్నం చేయాలి.లేదంటే మొత్తం నీరు వృధాగా పోతుంది.

ఈ న్యాయం కేవలం చెరువు నీటికి సంబంధించినదే కాదు.మానవ జీవితానికి, ఆర్థిక నిర్వహణా సామర్థ్యానికి అన్వయించి చూపిన చక్కని ఉదాహరణ.దక్షుడు లేని ఇంటికి బదార్థము వేరొక చోట నుండి వే/ లక్షలు వచ్చుచుండిన పలాయనమై చనుగల్లగాదు,ప్ర/త్యక్షము వాగులున్ వరదలన్నియు వచ్చిన నీరు నిల్చునే/ యక్షయమైన గండి తెగినట్టి తటాకము లోన భాస్కరా!"ఇంటి యజమానికి ఆర్థిక సంబంధమైన నిర్వహణా సామర్థ్యం లేనప్పుడు ఇతరుల నుండి అంటే వేరే చోట్ల నుండి లక్షలు లక్షల డబ్బు వచ్చినా వ్యర్థంగా ఖర్చయి పోతుందే కానీ పైసా కూడా మిగలదు.అవసరమైన మంచి పనులకు ఉపయోగపడదు. దీనినే భాస్కర శతక కారుడు ఇలా అంటాడు... ఏ విధంగా అంటే గండి పడిన చెరువులోకి ఎన్ని వాగులు వంకలు వచ్చి చేరినా ఒక్క చుక్క కూడా నీరు నిలవదు కదా!"

అందుకే కుటుంబం లోని వ్యక్తులు భర్త కానీ,భార్య కానీ. వారి ఆర్థిక నిర్వహణ సామర్థ్యం, నైపుణ్యాన్ని బట్టే కుటుంబం ఏ లోటూ లేకుండా సజావుగా నడుస్తుంది.ఈ తటాక పరివాహ న్యాయమునకు దగ్గరగా ఉన్న మర్యాద రామన్నను కథను చిన్నప్పుడు మనమంతా చదువుకున్నాం.

ఒక ఊరిలో రెండు గేదెలు ఉన్న రైతు,వంద గేదెలు ఉన్న రైతు పక్క పక్కనే ఉంటారు. రెండు గేదెలున్న రైతు చాలా పొదుపరి. పాలను అమ్మిన డబ్బును జాగ్రత్తగా దాచేవాడు.వంద గేదెలు ఉన్న రైతుకు తనకు చాలా గేదెలు ఉన్నాయనే గర్వంతో వచ్చిన డబ్బు వచ్చినట్లు ఖర్చు చేసే వాడు.

ఓ సారి అతడికి డబ్బు అవసరమై రెండు గేదెల రైతును అడిగితే అప్పుగా ఇచ్చాడు.ఆ తర్వాత ఎంత కాలమైనా ఇస్తానని ఊసే లేదు.అడిగితే "నేను ఇవ్వను పో. తీసుకున్నట్లు నువ్వు నిరూపించలేవు అని దబాయించాడు.

ఆ రెండు గేదెల రైతు మర్యాద రామన్నకు మొర పెట్టుకున్నాడు.మర్యాద రామన్న ఓ పరీక్ష పెట్టాడు.రెండు బకెట్లలో నీళ్ళు పెట్టించాడు. వచ్చే దారిలో బురద తొక్కి వచ్చి చెరొక బకెట్ నీళ్ళతో కాళ్ళు కడుక్కుని రావాలని చెప్పాడు. ఇదేం పరీక్ష అని ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నారందరూ.ఇద్దరు రైతులు కాళ్ళు కడుక్కొని వచ్చారు.అప్పుడు మర్యాద రామన్న వంద గేదెలు ఉన్న రైతును మందలిస్తూ వంద గేదెలు ఉండి కూడా అప్పు చేయడం మొదటి తప్పు.అబద్ధం ఆడటం రెండవ తప్పు.తీసుకున్న దానికి రెట్టింపు ఇవ్వమని తీర్మానం చేశాడు.ఎలా అంటే వంద గేదెల రైతు కాళ్ళు బకెట్ నీళ్ళతో కడిగాడు కానీ కాళ్ళకు అంటిన బురద పోనేలేదు.రెండు గేదెల రైతు రెండు మగ్గులతో కాళ్ళ బురద పోయేలా కడుక్కుని చక్కగా వచ్చాడు.దీనిని బట్టి అర్థమై పోయి వుంటుంది. వచ్చిన దానిని సమర్థవంతంగా ఉపయోగించుకునే సామర్థ్యం లేకపోతే తటాకంలో నీరులా వృధా అవుతుంది.ఇదిగో ఇలాంటి న్యాయాలు చదివినప్పుడు అలాంటి కథలు, పద్యాలు గుర్తుకు వస్తూ హితైషిగా హెచ్చరికలు చేస్తుంటాయి.



–వురిమళ్ల సునంద
9441815722

# బొమ్మ తుపాకి

అబ్బో చిన్న పిల్లాడికి ఎన్ని పెద్ద బొమ్మలో
రాత్రి లేదు పగలు లేదు
తెలివైతే ఆడుడే
అందరి నిద్ర పట్ట పగలు గతి తెల్లారినట్లే.
చుట్టాల పిల్లల ముందు పిల్లగాడు
గర్వంగా డ్యాన్స్ చేస్తాడు
ఆస్కార్ పాట పాడుకుంటూ.
బొమ్మలెన్నున్నా పిల్లోడికి నచ్చింది
' బొమ్మ తుపాకి'
విలన్ ఫోజులు పెట్టి భయపెడతాడు
సైతాన్ అయిపోతాడు మొత్తం
పసితనంలో ఏమీ రాక్షసానందం.
తల్లిదండ్రులు బెదిరించరు
"న్యూజెనరేషన్ జీన్స్" అంటూ
మన ముందే సెమినార్.
హింసా క్రీడలతో
ఇల్లు దాటి గల్లీ దాటి ఎటో ఎటో !
పోరడి దిండు కింద బొమ్మ తుపాకి
వయసు పెరిగే
పోరడికి బొమ్మ తుపాకి నచ్చుతలే
ఎంత నొక్కినా ధన్ మంటూ పేలడంలే వేస్ట్
సినిమాలు సీరియల్స్ ఈవెంట్స్ బారాత్‌ల్లో
బాంబుల మోతలే కదా "ఢాంఫట్ " !!
మరి ఈ బాబుకు బంతి ఆట నచ్చుతుందా
అరే ! పిల్లాడి మనసంతా
మందు గుండుతో వుండు
ఏం తట్టుకుంటాడు పసివాడు
కలలో మెషిన్ గన్ లే
అంతే ! "జ " బిబీతీని
పిడుగుల పిల్లగాడు తండ్రి బీరువాలోంచి
తూటల బరువున్న తుపాకి తీసాడు
ఆయుధంగా మమేకం
ఇంకేం ! ఆగుతడా! అయిపాయే ఖతం !!
పేరుపేరునా దోస్తుల పిలిచిండు
రౌండుగా తిరుగుతూ రౌండ్లు కాల్చిండు
గల్లీ అంతా రక్తం చిల్లింది!!
శాంతినగర్ లో అశాంతి బోర్డు
ఇట్ల ఎందరు పోరగాల్లో
మీ ఇంట్ల లేరు కదా
రేపు స్కూలు బ్యాగులో టిఫిన్ బాక్స్ కాదు
తూటాల తుపాకి
రేపు పుట్టబోయే పిల్లలు తల్లి గర్భంలోంచే
తుపాకులతో చతుర్భుజులై
వస్తారు
ఏడు రంగుల్లో బాలలకు "ఎర్ర
రంగే" ఇష్టమట
తగ్గేదేలే!
ఇప్పుడు పోరల ఊతపదం.
తల్లిదండ్రులారా!
బాలలకు బొమ్మ తుపాకులైనా
సరే
కొనీయకండి!
నేటి బొమ్మ తుపాకి
రేపటి గుండ్ల తుపాకి!!
బాల్యం పేలి పోతోంది
డేంజర్! బొమ్మ తుపాకి పైనా
పుర్రె బొమ్మ ముద్రించండి!!



–కందాళై రాఘవాచార్య
8790593638

# చీకటి బతుకుల్లో వెలుగులు తెచ్చిన సూర్యుడు

1990 దశకంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల అరాచకాలకు భయపడి, ఎన్నో ఇబ్బందులకు గురై జీవితాలను పణంగా పెట్టి, బానిసత్వంలో మగ్గిన జీవులు ఎందరో లెక్కేలేదు. అప్పుడప్పుడే సింగరేణి ప్రాంతంలో గురించి ఎంతో ఎంతో తెలుసుకుని మంచిర్యాల, గోదావరిఖని, కొత్తగూడెం, ఖమ్మం వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన పేదలు మరెందరో!

నాడు వల్లెటూర్లలో భూస్వాములు, పెత్తందార్ల దౌర్జన్యాలతో జనమంతా అల్లాడుతుంటే, అక్కడ సింగరేణి ప్రాంతంలో బావుల బాస్(దొర)ల ఆకృత్యాలతో కార్మికులు అల్లాడిపోయేవారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సమీపంలోని కానిపర్తి గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో మాదిరెడ్డి సమ్మిరెడ్డి జన్మించాడు. తను ఒక సర్వ సామాన్య యువకుడు. బతుకు తెరువు కోసం మంచిర్యాల బొగ్గుగనిలో పనికి కుదిరాడు. చెమట చుక్కలు ధారపోస్తూ నిత్యం కష్టపడుతూ బావి దొరల దోపిడీని కళ్ళారా చూశాడు. నేషనల్ యూనియన్ పేరుతో కార్మిక సంఘం లీడర్లు చేసే కక్కుర్తి పనులను అవగాహన చేసుకున్నాడు.

భూమి పొరల్లో వందల అడుగుల లోతుకి వెళ్లి నెత్తురును చెమటగా మార్చుకుని బొగ్గును ఉత్పత్తి చేసే శ్రామికుల కష్టాన్ని గమనించాడు. లోకానికి వెలుగును పంచాలనే తపనతో శ్రమ పడే కార్మికులు... మురికి కూపాల్లో, చీకటి పాకల్లో దుర్భర జీవితాలను వెల్లదీస్తుంటే చూసి ఆయన చలించిపోయాడు.

ఒక సామాన్య బొగ్గు గని కార్మికునిగా సాధారణ జీవితం ఆరంభించి, అసమాన పోరాటయోధుడుగా, కార్మిక వర్గానికి అగ్రశ్రేణి నాయకుడిగా ఎదిగిన సమ్మిరెడ్డి




-ప్రతులకు:
వలేటి అరవింద్ కుమార్
30-28/7-5౦, విమ్స్ హాస్టల్
గాంధీనగర్, ఔఖీ జిల్లా 520003
మరియు అన్ని పుస్తక కేంద్రాలలో

అలియాస్ రమాకాంత్ అలియాస్ అశోక్ జీవితం ఎంతో ఉదాత్తమైనది. ఆనాడు ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జగిత్యాల జైత్రయాత్ర మీదుగా వీచిన విప్లవగాలులు బొగ్గు గనులు అగ్గి రాజేశాయి. రమాకాంత్ లాంటి అగ్నిపర్వతానికి ఊపిరి పోసాయి. పోలీసు మూకలకు దొరకకుండా ఎన్నో పోరాటాలు చేశాడు. సింగరేణి కార్మిక క్షేత్రంలో ఎన్నో ఆసక్తికరమైన మార్పులకు ఆంధ్రుడు అయినాడు. ఎన్నో సందర్భాలలో పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటూ రాష్ట్ర పోలీసులకు ఆయన ఒక కొరకరానికి కొయ్యగా తయారయ్యాడు. భారత కార్మికోద్యమానికి నూతన జవసత్వాలు ఇచ్చి "పోరాడితే పోయేదేమీ లేదు - బానిస సంకెళు తప్ప" అని చెప్పి సింగరేణి కార్మిక వర్గాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములను చేసిన సింగరేణి కార్మిక సమాఖ్య నాయకుడు అతడు.

వందలాది పోలీసులు వలపని చుట్టుముట్టినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఒంటరిగా పోరాడిన ధైర్యశాలి. ఇద్దరు పోలీసులను చంపి మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచి భయమన్నది ఎరగకుండా ధైర్యంగా ఎదురు నిలిచి పోరాడాడు. కానీ అతనిని ముఖాముఖి ఎదుర్కోలేని పోలీసులు పద్మవ్యూహంలో అభిమన్యున్ని చుట్టుముట్టి చంపినట్లు... అతను తలదాచుకున్న ఇంటికి డ్రిల్లర్‌తో రంధ్రాలు చేసి అందులో నుంచి పెట్రోల్ పోసి, కాల్చి చంపారు. అతని బ్రతికే కాదు, చావు కూడా వీరోచితమైనదే!

1996 జూన్ 23న సింగరేణి శ్రీరాంపూర్ లో దలాది జనం చూస్తుండగానే సమ్మిరెడ్డిని పోలీసులు పెట్రోల్ పోసి చంపిన అమానుష చరిత్రను పి. చంద్ కళ్ళకు కట్టినట్లు రచించిన నవల ఇది. అద్భుత కల్పనలు ఊహ కథనాలు, అసందర్భ వర్ణనలు వంటి వాటి జోలికి పోకుండా సమ్మిరెడ్డి జీవితాన్ని ఉన్నదున్నట్లుగా మనకు పరిచయం చేశాడు రచయిత.

పి. చంద్ రచన శైలి సాహితీ వేత్తలు చాలామందికి తెలిసినదే. సామాన్య ప్రజాజీవనంలోంచి పుట్టుకొచ్చిన వీరుల చరిత్రలే ఆయన నవలలుగా రాశారు. సుమారు 74 నవలలు వివిధ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఉద్యమకారుల జీవితాలకు సంబంధించినవే. ఆయన రచనలు ఆనాటి కాలమాన పరిస్థితులను ఉద్యమ తీరుతెన్నులను, దోపిడీకి గురైన సామాన్య జనం పెత్తందారులపై తిరుగబడిన విధానం మన కళ్లకు కట్టినట్టు చూపెట్టి, ఉద్యమ సాహిత్య చరిత్రగా నిలిచిపోతాయి.

ఇక "వీరుడు" నవలలో... కేవలం కొన్ని గంటల పాటు జరిగిన యదార్థ ఘటనను ఒక అక్షర సమహారంగా గుదిగుచ్చి మన ముందు ఉంచారు రచయిత. ప్రస్తుత కాలంలో వామపక్ష ఉద్యమాలు అంతేగా కనపడకపోవడం వల్ల నేటి తరానికి వాటి తీరుతెన్నులు తెలియవు. వారి త్యాగనిరతి, పోరాటపాటిమా నిస్వార్థ సేవాగుణం ఇప్పటి యువతరానికి అర్థం కాదు. పైగా ప్రభుత్వ ఆదేశాల్లో అలాంటి కార్యకలాపాలకు తీవ్ర నిషేధం ఉంది. అది వేరే సంగతి!

కానీ రాజ్యం కొన్నిసార్లు ఎంత క్రూరమైనదో, ఎంత అమానుషమైనదో, ఎంత కఠినాతి కఠినమైనదో ఊహించడం కూడా చాలా కష్టం. దాని దోపిడీ గురించి మనం పట్టించుకోనంత వరకే అది శాంతియుతంగా, మేక వన్నె పులిలాగా మెదులుతూ, శాంతి ప్రవచనాలు వల్లె వేస్తుంది. ఒక్కసారి దాని దోపిడీ అనే పుట్టలోకి వేలు పెట్టి చూడు లేదా అది చేసే అన్యాయాన్ని గురించి ప్రశ్నించి చూడు. దాని అసలు రంగు బయటపడుతుంది. అప్పుడు దానికి విలువలతో పని ఉండదు. దాని ఫాసిస్టు ముఖం నగ్నంగా మనకు సాక్షాత్కరిస్తుంది. గద్దెనెక్కిన పెద్దల శాంతి ప్రవచనాల వెనుక ఉన్న రాక్షసత్వం బయటపడుతుంది. (పేజీ నం. 147)

ఇలా అధికార అహంకారంతో పదవీ వ్యామంలో ఉన్న రాజకీయ నాయకుల రాక్షసత్వాన్ని మనకు ప్రతి పేజీలు అద్భుత వాక్యాలుగా పొందుపరిచి ఒక సినిమా లాగా అందించారు చంద్. ఆనాటి రమాకాంత్ ఎన్కౌంటర్ సంఘటనను ఒక విలేకరి చూసి రాసిన కోణంలో కథనం సాగింది కానీ దానితోపాటు ఆనాటి పోరాట జ్ఞాపకాల దుంతరాలను రచయిత అలలు అలలుగా మన కళ్ళ ముందు ఉంచారు.

అందుకే ఇది ప్రతి ఒక్కరూ చదవదగిన పుస్తకం. ఆనాడు ఆకలి ఆరాటంలో ప్రాణాలకు తెగించి పోరాటం చేసి సమతా రాజ్యాన్ని స్వప్నించిన "సమ్మిరెడ్డి" లాంటి ఎందరో త్యాగధనుల జీవితాలను ఈనాటి యువత అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

జబ్ తక్ సూరజ్ చాంద్ రహేగా...

రమాకాంత్ తేరా నామ్ అమర్ రహేగా!

-ముక్కెర సంపత్ కుమార్
9959618206



పుస్తక సమీక్షలు

## భ్రమణం

ఉన్న చోటు నుండి
కదలడం.. తరలడం
ఒక ప్రకృతి ధర్మం
ఒక వలస చిహ్నం
సూర్యకిరణాలు చంద్రకాంతులు
ఋతువులు పవనాలు
మబ్బులు మెరుపులు
వానలు వరదలు
తరలి వచ్చేవే!
వానరులు నరులు
జీవులు జాతులు
భాషలు భావాలు
వలస పోయేవే!
కదులు మెదులు లేకుండా
లోకముంటుందా!?!

-శంకర వెంకట నారాయణ
సెల్:9959163676

## అమ్మ భాష

అమ్మ ఒడిన నేర్చి
బుడి బుడి అడుగున
అక్షరాలు దిద్దుతూ
అన్య భాషలు పలుక
ఆధారమైనట్టి భాష
అదే అదే గొప్పనైన తెలుగు భాష
తెలుగు మాటలన్ని మూటలుగా
తెలుగు తోటలోన విహరించగా
మాట పాట నాటిక తోడైనా
మనసంతా సంస్కృతి సాగేటి భాష
అదే అదే గొప్పనైన తెలుగు భాష
ఎంత ఎత్తుకెదిగి వేనోళ్ళ పొగిడినా
కోట్ల రాసులతో కనకమై నిలిచినా
బుక్కెడు బువ్వనే కడుపుకు ఆసరా
తెలుగు మాట్లాడినంత మనసుకు ప్రశాంతత
అదే అదే గొప్పనైన తెలుగు భాష
మాట మంచిదైనా సహకారం బంధమౌ
వేష బాసజూసి మనుజుల జాడుండు
బాష ఒక్కటైన బలంతో కలుదురు
కష్టసాగరాల తొలగించు సాధనం భాషయే
అదే అదే గొప్పనైన తెలుగు భాష




-ఉంద్రాళ్ళ రాజేశం
996694684

## మన తెలుగు వెలుగు భాష

నా తెలుగు దివ్య సుధ
నా తెలుగు భవ్య కథ.
పలుకు పలుకు లో కమ్మదనం
పదము పదములో అమ్మదనం
కలబోసిన విరబూసిన
మనసెరిగిన మన భాష
మన మెరిగిన జన భాష
మనకు జన్మనిచ్చిన భాష.
నా తెలుగు కమ్మన ....నానుడులు తీయన
నా భాష తిక్కన ..... శ్వాస పోతన
నా ఊసు వేమన ...నా యాస తిమ్మన
నా అందం కందుకూరి... నా చందం దువ్వూరి
నానుడి గురజాడ ..నా బడి గిడుగు జాడ
గద్దరు గోరంట్ల వంగపండు జన పాటలు
కాళోజి దాశరథి వట్టికోట కవన జ్వాలలు
ఇటు జాషువా శ్రీశ్రీ ఆరుద్రల కవన సౌరభాలు
అటు వీరేశలింగం బాపిరాజు రావూరి నండూరి
ఆదిభట్ల రాచకొండ తుమ్మల బోయి భీమన్న
పాలగుమ్మి చలసీల నవరసభరిత కవిత వేషాలు
తిరుపతి కొప్పర కవుల తెలుగు వెలుగులు
ఏమని చెప్పను ఎన్నని చెప్పను తెలుగు జిలుగులు-
నా కనులు కృష్ణ గోదావరుల వరి ...
నా మదులు పెన్నా నాగావళీల సిరి
పాట మురిసే విశ్వనాథుని కిన్నెరసాని
మాట విరిసే సినారెవిశ్వంభర వాణియై
శాతవాహన చాళుక్యలేలిన కోటిలింగాల
కాకతీయులు రాయలేలిన త్రిలింగాల-
మన్యం వీర అల్లూరి ..ఆంధ్ర కేసరి టంగుటూరి
కొమరం భీమ్... కన్నెగంటి హనుమంతుల గురి
అటు వేములవాడ ఇటు విజయవాడ
అటు గోల్కొండ హనుమకొండ
ఇటు పెనుగొండ నాగార్జున కొండ
త్రిలింగ దేశాన సంస్కృతి సాంప్రదాయాలు
తెలంగాణ ఆంధ్రుల అనుంగు ప్రేమానురాగ
నుదుటిబొట్టు ...పంచ కట్టు. చీరకట్టు
వేపచెట్టు చెరువుగట్టు పొలం గట్టు
సంకురాత్రి బతుకమ్మ సంబరాలు
సమ్మక్క సారక్క కొమరవెల్లి తిరునాళ్లు
నూకాలమ్మ పైడితల్లి తలుపులమ్మ వేడుకలు
పచ్చడన్నం పరమాన్నం సంకటి
పప్పు ఆవకాయ తొక్కు అంబలి
అన్నీ కల కలిసిన ఎన్నో కలబోసిన
యాబదారు అక్షరాల అనుబంధాలు
గుండ్రని భావాల అజంత అందచందాలు
తెలుగువారి హద్దులు వేరైనను
తెలుగువారి సుద్దులు ఒకటేను
తెలుగువారెక్కడున్నను
తెలుగు వారలనుచును
మన తెలుగు తేజము వెలగాలి
నేటి నిజ పౌరుషంబు చాటాలి
నేడు తెలుగుకన్నీ తెగులు
ఆపై డాబు ఇంగిలీసు సెగలు
ఎవరికి పట్టదండి అమ్మనుడి గిట్ట దండి
ఇకనైనా మన జనం కలం గళం ఎత్తాలి
శకలమగు తెలుగు సకలమై వెలగాలి
జై తెలుగు భాష
జై జై మాతృభాష

-రాఘవ మాస్టారు కేదారి
9741407099



## మనం ఇంతేనా ?

కులమతాలు ఉండొద్దని
మనుషులంతా ఒక్కటే అని
చెప్పేది మనమే ...
కులం చూసి - మతం చూసి మరీ
ఓటు వేసేది మనమే !
అవినీతి, లంచగొండి తనం
రూపుమాపాలి అని చెప్పేది మనమే
బేరమాడి లంచాలు ఇచ్చి పనులు
చేయించుకునేది మనమే !
ఇంటికో అల్లూరి, భగత్ పుట్టాలని
చెప్పేది మనమే..
మనఇంట్లో మాత్రం బిల్గేట్స్ పుట్టాలని
కోరుకునేది మనమే !
అన్నిట్లో మార్పు రావాలని
సమసమాజం నిర్మితం కావాలని
అందరిని సమానంగా చూసే
రామ రాజ్యం రావాలని చెప్పేది మనమే
ప్రజలు మారరు లెండి అంటూ నిరాశని
నూరిపోసేది మనమే !
అందుకే ...మనం మారము
ఇంకొకరిని మారనివ్వము కేవలం
ప్రభుత్వానికి పన్నులు కట్టే
గొర్రెలుగా మిగిలిపోదామా..



-న్యాలకంటి నారాయణ
9550833490


# అసమానతలను అపసవ్యాలను నిలదీసిన "ఆజాదీ"!

ఆధునిక కవిత్వం వర్తమాన మానవ సంవేదనను వర్ణనాత్మకంగా,చైతన్యాత్మకంగా, భావోద్వేగాలను పరవళ్ళు తొక్కిస్తూ, అసమతుల్యతల్ని, ఆందోళనల్ని,ఆవేదనల్నీ అభివ్యక్తీకరిస్తుంది. ఈనాటి సమాజం మార్కెట్ మాయకు చిక్కి,సంతృప్తి లేని చిత్తస్థితిలో వ్యాకులతకు లోనవుతున్నది. శ్రమచిత్తడిలో భుజబలంమీద సమాజ కట్టడాన్ని నిలబెట్టే శక్తులు నానాటికీ కష్టాల్లో కూరుకుపోతుంటే,వాణిజ్య సునామీల్ని వేలం వెర్రిగా సృష్టించే వ్యాపారవేత్త అందలమెక్కి ఆనందప డుతున్నాడు. సమాజంలో వివక్షత వెర్రితలలు వేస్తూ విస్తరిస్తున్నది. అసమతుల్యమైన సమాజ పోకడలను ఉద్యమస్ఫూర్తితో, జ్ఞాపకాల రెప్పలిప్పి దుఃఖిత అగ్నిరేఖలు వాక్యాలుగా "ఆజాదీ" శీర్షికతో ఒక కవితా సంపుటిని వెలువరించిన చైతన్యకవి కరిపె రాజ్ కుమార్. వృత్తిరీత్యా ఆడిట్ అధికారిగా, ప్రవృత్తిరీత్యా సామాజిక జీవనవిధానపు అక్రమ పద్దుల్ని ఆడిట్ చేస్తూ మానవజాతి ఔన్నత్యాన్ని అభిలషిస్తూ అభ్యుదయ భావాక్షరమై అలరారు తున్న కవి ఈయన. సామాజిక అంధకార గోడల్ని పడగొట్టాలనే ఆశయంతో కవితా సేద్యం చేస్తున్న కవీయన.

ఈనాడు అతితెలివిని ప్రదర్శిస్తూ జనంమీద బతికే నయవంచకుల పీచమణచాలని,"ఆగ్రహ జ్వాలలతో ఎగిసిన అలలు/పున్నమి పోటై/ పునాదుల్నే పెకలించాలనే ఆశావాహ కలలు కంటాడు కవి, "పున్నమి పోటు"కవితలో!. వీడి నైజం ఎలా ఉంటుందో చెప్తూ "వేల జనాల్ని వెర్రివారిగా తలుస్తూ/వేడుకగా వ్యాపార సునామీల్ని/వేలంవెర్రిగా సృజించగలడు/పేదలను ఉద్ధరించ డానికే తను జన్మనెత్తానని/అమాయక జీవులను/అసాధ్యంగా బుట్టలో వేయగలడు"అంటాడు.

ప్రాణాల్ని పణంగా పెడుతూ వీరజవాన్లు దేశాన్ని రక్షిస్తూ ఉంటే మనమంతా హాయిగా స్వేచ్ఛగా అన్ని సౌకర్యాలను అందిపుచ్చుకుని ఆనందిస్తున్నాం.

కాని, వారిని "లక్ష్మీతరేఖ వెంబడి




ప్రతులకు:
కరిపె రాజ్‌కుమార్
13-105, ఎన్.టి.ఆర్ చౌక్,
విద్యానగర్, ఖాన్‌పూర్ పోస్ట్,
నిర్మల్ జిల్లా, తెలంగాణ

/ క్షణ?లక్ష్మీతరేఖ వెంబడి / క్షణక్షణ విహంగ వీక్షణలో/ రాత్రో పగలో తేడాతెలియని అప్రమత్తతతో/ తనువంతా కళ్ళు చేసుకొని/పకడ్బందీ పహారా కాసే/సూర్య చంద్రుల సూటి స్నేహితుడా"! అని వర్ణిస్తూ కవి సైనికునికి వందనాలు చెల్లిస్తాడు. కఠోర క్రమశిక్షణను/క్రమంగా అలవరచుకొని/ బాల్య సంకల్పాన్ని/బాధ్యతతో నెరవేర్చుకున్న/భావిభారత భాగ్యవిధాతలుగా తలపోస్తాడు. ఇల్లు, ఇల్లాలి క్షేమం,దేశక్షేమంకంటే దిగువగా భావిస్తూ "దేశరక్షణే ధ్యేయంగా/నిరాశ నిస్పృహలను/ దరిచేరనీయకుండా/ఆశాదీపాలను భుజస్కంధాలపై/అనవరతం అలసిపోకుండా మోసే/ ఓ భరతమాత పుత్రుడా/భ్రాతుడా!"అంటూ సైనికులకు అభినందనలు తెలియజేస్తాడు.

కదన రంగంలో కదంతొక్కే వీరసైనికులను కీర్తిస్తూ కవి "కదనరంగాన కాలుమోపితే/కడలి తరంగమై ఉవ్వెత్తున ఎగసి/మెరుపు వేగంతో/ పిడుగులు కురిపిస్తూ/అపర కాలుడై/ శత్రుమూకల కుత్తుకలు కత్తిరిస్తూ/ వీరవిహారం చేసి/విజయతిలకాన్ని/ నొసటదిద్దుకునే వీరసైనికుడా!"అంటూ అభివందనాలు చెల్లిస్తాడు కవి.

కలిసిరాని కలికాలపు/గాలానికి చిక్కి/అమరుడవైతే/ఆసేతు హిమాచలం/అంజలి ఘటిస్తుంది/సువర్ణాక్షరాలతో చరిత్ర/నిను స్మరిస్తుంది/ తరిస్తుంది అంటూ తన్మయత్వంతో కీర్తిస్తాడు.

"పుండాకోర్లు" కవితలో సంచార జాతుల దీన హీన స్థితిని కవి కళ్ళకు కడతాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా సంచార జాతులు వారి వారి వ్యక్తిత్వాలను నిలుపుకొంటూ పుండాకోర్లుగా ముద్రపడినా సహిస్తూ మౌనంగా భరిస్తూ దిన దిన గండంగా బ్రతుకులీడుస్తున్నారు. ఇలాంటి సంచార జాతుల జీవనాన్ని కవిత్వీకరించిన కవి కరిపె రాజ్ కుమార్ నిజంగా అభినందనీయులు.

వారి కుటుంబ కష్టాలు ఎలా ఉంటాయో విడమర్చి చెపుతూ "పిల్లలు/చిరుప్రాయంలోనే/తల్లిదండ్రులతో ఎడబాపబడి/క్వారంటైన్ సాకుతో/ సుదూరాలకు తరలించబడి/తండ్రులు/ చేయని నేరాలకు/తీవ్ర శిక్షలు అనుభవించి తీరుతూ" నరక యాతనలకు గురవుతుంటారు. వారిని "తరాల తరబడి/నామకరణమైన/ దేశద్రిమ్మరులు/నానా సంచార జాతులు" అని "పరుల అంతరంగాలకు అందని/సమాచార రాయబారులు/చరిత్ర దొంతరల అంతరాళాల్లో/అదృశ్య ధరిత్రీ పుత్రులు "అంటూ వీరు ప్రథమ స్వాతంత్ర్య సమరానికి సాలుతీసిన సమర్థులు"అని పేర్కొంటారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించాలని స్థిరనివాస ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తారు.

భారత స్వాతంత్ర్య సమరంలో అమరుడు "రాజ్ గురు"చేసిన త్యాగాన్ని "ప్రతీకార కిశోరం"కవితలో కీర్తిస్తూ కవి "స్వాతంత్ర్యం మనకు కేవలం శాంతి మార్గంలో మాత్రమే రాలేదు. అనేకమంది క్రాంతికారుల రక్తతర్పణంతో సిద్ధించిన వాస్తవాన్ని దర్శింపజేస్తాడు."సైమన్ కమిషన్ భారత సందర్శన సందర్భంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న/లాలా లజపతిరాయ్ పై /లాఠీచార్జి జరుగగా/ తీవ్ర అస్వస్థతతో అసువులు బాసిన/ ఆ అపర సింహుని ఆత్మకు శాంతి చేకూర్చాలని/ప్రతీకారానికై ప్రతినపూనిన/రాజ్ గురు/చండకోపితుడై/ సాండర్స్ ను చంపివేయగా" ఆనాటి అరాచక ఆంగ్లప్రభుత్వం రాజ్ గురుకు మరణశిక్ష విధిస్తుంది. ఆయన పరాక్రమాన్ని త్యాగనిరతిని కవి ఈ కవిత లో చాలా చక్కగా వివరిస్తాడు. నానాటికీ కనుమరుగవుతున్న దేశభక్తిని నేటి యువతకు నూరిపోస్తాడు.

"కరపత్రం వేద్దామా"కవిత వర్తమాన సమాజంలోని అన్యాయాల్నీ అక్రమాల్నీ నర్మగర్భంగా వ్యక్తీకరిస్తుంది. ఊరించి ఉడికించి ఆశలు రేపి,కురవని మేఘాలను కిందకు దిగిరమ్మని కరపత్రం వేయడం,కవి వ్యంగ్యంగా కారణాన్ని ఎత్తిపొడవడమే! ఆకుపచ్చని అడవుల్ని అడ్డంగా నరికి అక్రమంగా సొమ్ము చేసుకునే ప్రబుద్ధులకు గుణపాఠం చెప్పాలనే సందేశాన్ని ఈ కవిత ప్రతిబింబి స్తుంది. అడవులను అడ్డగోలుగా నరికివేస్తే వర్షాలు కురవవనే అంతస్సూత్రం ఇందులో ఇమిడి ఉంది. ధరణి గర్భాన్ని అణువణువూ ధ్వంసమొనరిస్తూ/ప్రకృతి వనరులను పకడ్బందీగా చెరపట్టే/వారి పనిపట్టాలనేది,కవి భావన. "నిత్యావసర వస్తువుల ధరలు/నింగికెగసి/నేలకు దిగిరాక పోవడానికి/కారణాలను విశ్లేషిస్తూ ద్రవ్యోల్బణ వెతలను ఏకరువు పెడతాడీకవి. ఈ సమస్యలకు పరిష్కారం "కరకరలాడే కరపత్రం" వేయడమేనంటాడు.

"ఆజాదీ" కవితా సంపుటిలో మొత్తం అరవై మూడు కవితలున్నాయి. అన్ని కవితలూ సామాజిక స్పృహను నింపుకొని జనచైతన్యాన్ని ఉరకలెత్తించేవే!

కవి సమాజాన్నిగూర్చి, దేశాన్ని గూర్చి ఎంతో లోతైన దృక్పథంతో, నిశిత పరిశీలనా దృష్టితో తన కవిత్వాన్ని "వనఝరి"గా "స్వేచ్ఛాగానం"చేస్తాడు.

ఈ కవితా సంపుటికి ముందుమాట రాసిన నందిని సిధారెడ్డి గారు ఈతని "కవిత్వమొక జీవనోపాసన"గా అభివర్ణించాడు. "ఆజాదీ"ని అందరూ చదువవలసినదిగా భావిస్తూ కవి కరిపె రాజ్ కుమార్‌ను అభినందిస్తున్నాను.



-కొండ్రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి
9948774243

## ఏం రాయను!

మనసంతా శూన్యం ఆవరించి చాలకాలమైంది
మూలమూలనా పేర్చుకున్న భావమాలికలన్నీ
ఆలోచనల దారం తెగి విడివడి చెల్లా చెదురైపోయాయి
పూలన్నీ రెక్కలు రాల్చుకుని మౌన ముద్ర వేశాయి
అక్షరాలకు తలలు తెగిపోయి మొండాలు గుండె
గోడల మీద వెళ్ళాడుతున్నాయి
తెగిపోయిన తలల కోసం వెతుకుతున్నా ఏదో ఒకటి
అతికించి ఓ రూపం ఇద్దామని
గిల గిలలాడే భావాలకు ప్రాణం పోద్దామని
ఎంత ప్రయత్నించినా అతుక్కుపోయిన
పెదాలు తెరుచుకోడం లేదు మౌనం చెరలో
నుంచి మాట విముక్తి పొందటం లేదు
బిగుసుకున్న పిడికిలి విచ్చుకోడం లేదు
అందుకే అనిపిస్తోంది ఇంక చెప్పడానికి ఏమి లేదని
గుండె గోడపై అజంతా చిత్రాలు పూర్తిగా
వెలిసిపోయాయని శిలా రాతలే చెదిరిపో...
వీలైతే విధాతనే రాత మార్చమని
అడుగుదామని సాధ్యమేనా!



-అత్తలూరి విజయలక్ష్మి
సెల్: 9676881080

## మానవ నైజం

నైజం మానవునికి సహజం
ఆత్మకు కుడి భుజం
అబ్బుర పరిచే చోద్యం
ఆత్మారాముని రాజ్యం
అసువులు లేవనెత్తే ధ్వజం.

సుగుణాల మాలిక కావచ్చు
సులక్షణాల ఏలిక కావచ్చు
పగవారి పాలిట కాళిక కావచ్చు
వరాల నొసగే నాలిక కావచ్చు.

ఆరాధనకు, ఆలోచనకు
అసహనానికి ఆత్మయతకు
ఆలంబన మవుతుంది
హారతులిస్తుంది.

అందితే జుట్టు పట్టుకొమ్మని
అందకుంటే కాళ్లు పట్టుకొమ్మని
అవసరానికి వాడుకొమ్మని
అల్పుని నైనా వేడు కొమ్మని
బోధిస్తుంది సాధిస్తుంది.

మానవత్వంలోను
దానవత్వంలోను
దైవ తత్వంలోను
లుప్తమై ఉంటుంది..


నైజానికి రూపంలేదు
అది అంతర్గతం..!
నైజానికి మార్పు రాదు
అది స్వయం సిద్ధం..!!



-ఎన్. రాజేష్
9849335757

## అనంతం..!

ఆ కలం..
తన బాధను కన్నీటిగా మలచిన
ఆందోళనా సిరాని కక్కలేదు..
ప్రపంచ బాధను తన వేదనగా మార్చి
ఉత్తేజిత ఎర్రని ఉద్యమ సిరాని
సమాజ జన సంద్రంలో చిలకరించింది...
ఆ కలం...
నిశ్శబ్దంగా మూగబోయిన
ఆ జన సంద్రాన్ని..
సామాజిక చింతనా మేఘమై పలకరించి
తన స్వేచ్ఛా కవిత్వ చినుకులతో
తట్టి లేపిన మహాప్రస్థాన యాజమాని...
ఆ కలం...
ఏడవకండి ఏడవకండి అని ఓదార్చుతూనే
అన్యాయాలనెదిరించే కత్తులను
తయారు చేసింది..
పౌరహక్కులకై పోరాడుతూనే
ప్రపంచ సాహితీ చరిత్రలో తనకంటూ
ప్రత్యేక స్థానమేర్పరచుకుని
రెక్క విప్పిన విప్లవ శంఖారావం పూరించిన
ఆ కలం కవిత్వ కామధేనువై చేసిన
కవన యానం...అనంతం...!



-యర్రాబత్తిన మునీంద్ర
8331844527

## అందుకే గర్విస్తా

నలుదిక్కుల్లోని
ప్రతి కోణాన్ని చూస్తాను.

భూత వర్తమాన
భవిష్యత్తుల్లో పయనిస్తాను.

బడుగు బలహీనుల పాలిట
స్వరమై అక్షర గళమైతాను.

స్త్రీ ఔన్నత్యమే దేశ సౌభాగ్యమని,
యువత భవితకు మార్గమై సూచిస్తాను.

ప్రపంచానికి కనిపించని
ఆ చీకటి కోణాన్ని
దీపమై వెలుగుతో నింపుతాను.

నాడు కిరీటంతో రాజులు,
నేడు కిరీటం లేని పాలకులుగా ఉన్నా
నే మాత్రం ప్రజ్వరిల్లే అక్షర భానుడినౌతాను.

అనుబంధాల్లోని ఆత్మీయతను,
అనురాగాన్ని తీయదనమై
పంచి పెడతాను.

అస్తమించిన సూర్యుడు
తిరిగి ఉదయించే వరకు విశ్రమించక
ఒపటి కొత్త వెలుగౌతాను .

సూర్యచంద్రులు సంచరిస్తున్న వరకు
ఏకవైనా,రచయితైనా సమ సమాజం
కోసమే పరితపిస్తాడు.

అందుకే కవిగా గర్విస్తా,..
రచయితగా సంతోషిస్తా,..
కథకుడిగా కవ్విస్తా,..
విమర్శకుడిగా సంధిస్తా....




-డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్
సెల్:9490841284

## అమరులైన ఆత్మీయులెందరో

అమరుల స్థావరాలను
ప్రాణమెత్తుగా కాపాడుకుందాం!!
వారి జ్ఞాపకాలను నెమరువేసుకుందాం!!
త్యాగమై నిలిచి
మనకు కొత్తత్రోవ చూపించారు...
ప్రాణాలను తెంచుకొని
మన ప్రగతికి దారులు వేశారు...
ఇలవేల్పులై మన విలువలను కాపాడారు.
వారి ఊపిరి మనకు ఓ ఉషోదయం!!
వారి తెగువతోనే మన తగవులన్నీ పోయినవి.
వారి తెగింపుతోనే
మన బతుకు సమస్యలకు ఓ ముగింపు
అందుకే వారిని తలుచుకొని కొలుచుకోవాలి.
స్వార్థం లేని వారి త్యాగం
మనకు నిత్యం ఓ చైతన్యం!!.
మనం ప్రలోభాల మాయలో పడి
వారి త్యాగాలను మరుస్తున్నాం...
అమరులైన ఘన వీరులు వారు...
జన్మభూమికి నిజమైన వారసులు...
కొత్త కీర్తి బావుటాను ఎగరేసిన ఘనులు..
వారి ప్రాణత్యాగం మన జీవితాలను చుట్టేసింది...
వారి ఉద్యమం మన బతుకును కట్టి పడేసింది...
వారి మరణం ఓ ఉద్యమ తీరం!!
వాళ్ళ గుండెల్లో చీకటి నింపింది...
మన అందరి గుండెల్లో వెలుగులు నింపారు...
నిజమైన ఉద్యమధీరులు...
అందరి కొరకు అంతమైన శూరులు!!
ఇది అన్యాయాల ఆనకట్ట!!
తెంపాలంటే ఎవరో ఒక్కరూ చావాలి!!
ఆ తెగింపుతోటే ఆ సమస్యకు ముగింపు..
నిరాశ నిట్టూర్పులు మోయలేక
ఉద్యమాన్ని నడపలేక త్యాగమై
ఉద్యమస్ఫూర్తికి మార్గమై నిలిచారు!!
వారి త్యాగబలమే
మనకు బలగమై మనల్ని ముందుకు నడిపించారు...
ఎన్నెన్నో ఆటుపోట్లను ఒడిదుడుకులను
ఓపికగా భరించి చివరికి విసుగు
చెంది త్యాగమై నిలిచారు...
బానిసత్వం భరించలేక
స్వార్థపు తత్వాలను సహించలేక...
తమ వ్యక్తిత్వాన్ని చంపుకోలేక త్యాగమయ్యారు...
వారి దారి మనకు పోరాడే ధైర్యం నేర్పుతుంది...



దోపిడి దారులు ఉన్నంత కాలం
ఈ తెగింపు పోరాటం తప్పదు!!
నినాదం ఆయుధం పట్టుకోక తప్పదు!!
ఓ ఉద్యమంగా గుండెలో ఊపిరి తీసుకున్న
ఆ త్యాగ మూర్తుల బాటలో నడవాలి...
ఏ శతాబ్దాలను తిరగేసినా..
ఏ చరిత్ర ఘట్టాల్ని వడబోసినా..
రక్తసిక్తం లేని నేల కనబడదు!!
ఈ భూమి మీద త్యాగధనులే ఎక్కువ..
అమరులైన ఆత్మీయులే ఎక్కువ...
వీరిని గౌరవించుకుందాం!!
కొలుచుకొని
నిత్యం తలచుకుందాం!!



-అంబటి నారాయణ.
9849326801

# పాటలుగా ఈ గీతావళి

పాటలు పాడటం కొందరికి ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేము. అలా పాడుతూ వుంటే, వాటిలోని సాహిత్యపు గుబాళింపులు ఆస్వాదించి, అనుభవించి, తద్వారా తనకు తెలియకుండానే తానే ఒక గీతానికి పురుడుపోస్తాడు. ఇదే జరిగిందేమో మన పున్న అంజయ్య కవి విషయంలో కూడాను. పాటలు పాడుతుంటే చప్పట్లు బాగా పడేవట. ఆ విధంగా పాటలపై మమకారం పెంచుకొని ఆయా సందర్భాలను బట్టి అప్పుడప్పుడు కొన్ని పాటలు రాయడం జరిగిందని అంజయ్య తన ముందు మాటలో చెప్పుకున్నారు. మొదటి గీతం లాలీలో, **శ్రీ వెంకటేశుని నిరుపేద జీవుల నేలెడి స్వామి**




ప్రతులకు:
సాహితీ మేఖల ప్రధాన కార్యదర్శి 6-2-954/2, రోడ్ నెం.3 కాకతీయనగర్, మీర్‌బాగ్ కాలనీనల్లగొండ-508 001.
సెల్:9396610639

**నికృష్టముల బాపరావదేమి** అంటూ లాలించిన తీరు బాగుంది. తెలుగు వీర లేవరా, ఎత్తవోయి సోదరా, భారతమాత బిడ్డలం, తెలంగాణా గీతం వంటివి వీరి దేశభక్తికి నిదర్శనంగా నిలిచాయి. చేనేత గీతంలో నేత కార్మికులను ఉద్దేశించి వ్రాసిన, **నీ పేగులే పోగులుగా మలచి నీ బ్రతుకునే వస్త్రముగా నేసి అందాలే అలరించి అందరికీ అందించిన వస్త్ర కళాపోష** అన్న మాటల్లో కవి ఆవేదన కనపడుతుంది. **దూరవిద్య దగ్గరై దుని యాన్నే మార్చిన రోజు, పట్టుదలతో చదివిన వారికి పట్టా చేతికందిన రోజు** అంటూ రాసిన గీతం ఎంతో బాగుంది. **నాగలి పట్టే రైతన్న** అంటూ రాసిన గీతంలో దళారీలు నడుమ దోచుకుంటున్నారన్నారు. తెలుగమ్మ తెలుగమ్మ, తెలుగు పాట, తెలగు వీర లేవరా వంటి గీతాల్లో, ధైర్యం చెబుతూ మంచి సందేశాలను కూడా చేర్చారు. పొదుపుంటే జీవితానికి అర్థం, లేకుంటే బతుకంతా వ్యర్థం, పొదుపుతోనే జీవితానికి శాంతి అంటారు అంజయ్య. **'కమ్మనైన అమ్మపదం అమ్మా', మా శక్తివి నీవమ్మా** అంటూ రాసిన నాలుగు గీతాలూ మాతృప్రేమ గొప్పదనాన్ని వివరించాయి. పాటలు గా అంజయ్యగారి కంఠంలో వింటే ఎంతో మధురంగా వుంటాయనిపిస్తుంది.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి,
సెల్: 99490 92761

